క్లుప్తంగా

నేడు మందమర్రికి వివేక్ రాక

మందమర్రిరూరల్: చెన్నూర్ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిచి మెదటిసారిగా శుక్రవారం గడ్డం వివేక్ వెంకటస్వామి మందమర్రికి రానున్నారు. జెడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నల్లాల ఓదెలు నివాసంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నుంచి పలువురు నాయకులు చేరే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ నాయకులు చాలా మంది ఎన్నికల సమయంలో డబ్బుల పంపిణీ చేయలేదని మాజీ ఎమ్మెల్యే సుమన్ ఆ పార్టీ నాయకులను మందలించాడని తెలిసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని బీఆర్ఎస్ నాయకులు అనుకుంటున్నట్లు తెలుస్తుంది.

బీఎంఎస్‌కు రాజీనామా

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లో పలువురు బీఎంఎస్ నాయకులు యూనియన్‌కు రాజీనామా సమర్పించారు. ఆ యూనియన్ నాయకులు పొడిశెట్టి వినోద్, రామకృష్ణ, పంచరుపుల నరేశ్, గోపతి సందీప్ యూనియన్ నాయకత్వ వైఖరికి నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

యువతకు స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ



స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేస్తున్న నాయకులు

వేమనపల్లి: మండలంలోని నాగారాం గ్రామానికి చెందిన ఎస్టీ కాలనీ యువతకు ఎంపీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ సహకారంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు యువతకు వాలీబాల్ స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముల్కల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నైతం శంకర్, రమేష్‌రెడ్డి, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

సిబ్బందికి సన్మానం



సిబ్బందిని సత్కరిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

వేమనపల్లి: గడిచిన శాసనసభ ఎన్నికల్లో చురుకుగా పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంపీడబ్ల్యూ వర్కర్లను ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు గురువారం అభినందించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి రాహుల్ పంపిన ప్రశంసాపత్రాలను అందించి, శాలువాలతో సన్మానం చేశారు. నీల్వాయి ఆదర్శ పోలింగ్ కేంద్రంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శి జాఫర్, ఎఫ్ఏ కిషన్, ఎంపీడబ్ల్యూ వర్కర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రసాద్ , సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెడ్మ బొజ్జును కలిసిన కాంగ్రెస్ నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

జన్నారం: ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును హైదరాబాద్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. బొజ్జుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జన్నారం మండల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. కలిసిన వారిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, ఎంపీటీసీ రియాజోద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, పార్టీ నాయకులు ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కౌటాల: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి గురువారం అప్పగించినట్లు ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ రవీంద్రనగర్ గ్రామానికి చెందిన అనిల్ మండల్ ఇటీవల తన రూ.16 వేల విలువ గల సెల్‌ఫోన్‌ను బోదంపల్లి సమీపంలో పాగొట్టుకున్నారని తెలిపారు. సీఈఐఆర్ ద్వారా ఫిర్యాదు చేయగా ఫోన్ ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

జ్ఞాన భాండాగారానికి తాళం

- లైబ్రేరియన్ లేక మూసి ఉంటున్న లైబ్రరీ
- నాలుగు మండలాలకు ఒక్కరే ఇన్‌చార్జి
- వారానికి రెండు రోజులు మాత్రమే తెరుస్తున్న వైనం
- కొత్త పుస్తకాలు తేవడంలోనూ నిర్లక్ష్యం
- నిరుద్యోగులకు తప్పని అవస్థలు



మూసి ఉన్న జన్నారం గ్రంథాలయం

జన్నారం: విద్యార్థులకు, నిరుద్యోగులకు, యువకులకు జ్ఞాన భాండాగారంగా పిలిచే లైబ్రరీల సేవలు ఇప్పుడు అందనిద్రాక్షగా మారాయి. లైబ్రరీ నిర్వహణపై జిల్లా అధికారులుగాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. లైబ్రరీ ఎప్పుడు తెరుచుకుంటుందో, ఎప్పుడు మూసి ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో పోటీ పరీక్షలకు నోటిఫికేషన్లు పడుతుండటంతో నిరుద్యోగులు పోటీ పరీక్షలకు చదువుకోవాలంటే గ్రంథాలయం ఉపయోగపడటం లేదు.

కొరవడిన గ్రంథాలయ నిర్వహణ..

జన్నారం మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీలో సంవత్సరాల కాలంగా గ్రంథాలయం నిర్వహణ జరుగుతోంది. గ్రామ పంచాయతీలో ఒక గదిని గ్రంథాలయానికి కేటాయించి, స్థానికులకు గ్రంథాలయం సేవలందిస్తున్నారు. వివిధ రకాల పుస్తకాలతో పాటు, పత్రికలు, మాగ్జిన్‌లను చదువుకునే అవకాశం కల్పిస్తోంది. గతంలో పోటీ పరీక్షలు, ఉద్యోగాలకు సంబంధించిన పుస్తకాలు కూడా గ్రంథాలయానికి వచ్చి స్థానికులు చదువుకునే వారు. మూడు సంవత్సరాలుగా గ్రంథాలయం నిర్వహణ కొరవడింది. గ్రంథాలయానికి పూర్తిస్థాయిలో అధికారి లేకపోవడం, ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియక గ్రంథాలయానికి పాఠకుల సంఖ్య తగ్గుతుంది.

ఒక అధికారి, నాలుగు మండలాలకు ఇన్‌చార్జి

జన్నారం గ్రంథాలయ అధికారికి రెగ్యూలర్ పోస్టు ఉన్న లైబ్రేరియన్ల కొరత కారణంగా నాలుగు మండలాలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో వారంలో మండలానికి రెండు రోజులు వెళ్తూ, విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. జన్నారం మండలంతో పాటుగా కోటపల్లి, వేమనపల్లి, మంచిర్యాల మండలాలకు కూడా ఇక్కడి లైబ్రరీయన్‌ను ఇన్‌చార్జిగా నియమించడం వల్ల సేవలు ఎక్కడా పూర్తి స్థాయిలో అందడం లేదు. మూడు సంవత్సరాల నుంచి ఇదే తంతు సాగుతోంది. జన్నారం మండలంలో కేవలం శని, ఆదివారాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ తెలిపారు.

పుస్తకాల కొరత..

లైబ్రరీ అంటే పుస్తకాల భాండాగారంగా, జ్ఞాన భాండాగారంగా చెబుతారు. ఎక్కడ దొరకని పుస్తకాలు లైబ్రరీలో లభిస్తాయి. అందుకే యువకులు, విద్యార్థులు, నిరుద్యోగులు పుస్తక పఠనం కోసం లైబ్రరీకి వస్తుంటారు. కానీ జన్నారం గ్రంథాలయంలో కొన్ని పాత పుస్తకాలు, కథల పుస్తకాలు, నాలుగు రకాల పత్రికలు మాత్రమే ఉన్నట్లు పాఠకులు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో పుస్తకాలను తీసుకొచ్చి అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. అధికారులు స్పందించి, నూతన ప్రభుత్వంలో ఉద్యోగ నోటిఫికేషన్లు పడుతాయని ప్రచారం జరుగుతున్న తరుణంలో రెగ్యూలర్ లైబ్రేరియన్‌తో పాటు, పుస్తకాలు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

సొంత భవనం నిర్మించాలి



గ్రంథాలయం అందరికీ అవసరమైనది. ముఖ్యంగా యువకులకు, నిరుద్యోగులకు, విద్యార్థులకు పుస్తకాలు చదవడానికి చాలా అవసరం, కానీ ఇక్కడ ఇరుకైన గదిలో ఎక్కువ మంది ఉండే వీలులేకుండా పోతోంది. అందుకే గ్రంథాలయానికి కొత్త భవనం మంజూరు చేసి నిర్మించాలి.

- కొండపల్లి మహేశ్, పొనకల్

రెగ్యులర్ అధికారిని నియమించాలి



పోటీ పరీక్షలకు చదువుకోవడానికి పుస్తకాలతో పాటుగా రెగ్యూలర్ అధికారిని నియమించాలి. ఇప్పుడు ఉన్న అధికారికి నాలు గు మండలాలు ఇన్‌చార్జి ఇవ్వడంతో గ్రంథాలయం వారంలో రెండు రోజులు మాత్రమే తెరుస్తున్నారు. ఇలా అయితే నిరుద్యోగులకు గ్రంథాలయం సేవలందడం కష్టమే.

- పాత రాజన్న, కలమడుగు

అందుబాటులోకి తేవాలి



లైబ్రరీలో కొన్ని పుస్తకాలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వం డీఎస్సీతో పాటుగా, గ్రూప్స్ పోస్టులు కూడా వేస్తున్నందునా సంబంధించిన పుస్తకాలను అధికారులు అందుబాటులో పెట్టాలి. నిరుద్యోగులకు, విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులోకి తీసుకొచ్చి సహకరించాలి. ఉన్నతాధికారులు ఈ విషయంలో చొరవ చూపాలి.

- ఎంఏ యాసీన్, జన్నారం

ఇన్‌చార్జి ఇవ్వడంతోనే ఇబ్బంది

నాకు రెగ్యూలర్ జన్నారంకు పోస్టు ఇచ్చారు. మూడు సంవత్సరాలుగా కోటపల్లి, వేమనపల్లి, మంచిర్యాల మండలాలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. దీంతో ఎక్కడా సరిగ్గా పని చేయలేకపోతున్నాను. వారానికి రెండు రోజులు మాత్రమే తెరువాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

- మురళి, లైబ్రేరియన్, జన్నారం

చెన్నూర్ మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్‌గా దేవేందర్



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నూర్: స్థానిక మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్‌గా టేకుమట్ల దేవేందర్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. దేవేందర్ 2019లో మైనార్టీ గురుకుల పాఠశాలలో పీజీటీగా చేరారు. దేవేందర్ ఉపాధ్యాయ వృత్తితో పాటు పాఠశాలలో పలు బాధ్యతలు నిర్వహించారు. దేవేందర్‌ను ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పీజీటీ నుంచి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన దేవేందర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ ఖాజా యాజజోద్దిన్, ఎండీ మోహసిన్ ఖాన్, ఎండీ నజీర్ హైమద్, హిత్యాజ్‌ఖాన్, శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

భీమారంలో కాంగ్రెస్ నాయకుల సంబురాలు



సంబురాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

భీమారం: కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గురువారం సాయంత్రం భీమారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు టపాసులు పేల్చి సంబురాలు నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రజల పాలన మొదలైందని పార్టీ నాయకులు పోడేటి రవి పేర్కొన్నారు. ఇందులో పార్టీ జిల్లా నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి, బుక్యా లక్ష్మణ్, పెద్దల బాపు, ఆవుల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంప్ సామగ్రి మాయంపై విచారణ జరపాలి



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గల సామగ్రి మాయం అయ్యిందని, సామగ్రి మాయంపై అధికారులు విచారణ జరుపాలని డిమాండ్ చేస్తూ సీఐ వాసుదేవరావు, ఆర్ఐ సంతోశ్‌లకు ఫిర్యాదు చేసినట్లు యూత్ కాంగ్రెస్ నాయకులు తనుగుల రవికుమార్, అఖిల్, నహీమ్ తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో గల ఏసీలు, ఇతర సామగ్రిని కొందరు బీఆర్ఎస్ నాయకులు వ్యాన్‌లలో తరలించారని పేర్కొన్నారు. క్యాంప్ కార్యాలయం బాధ్యతలు అధికారులు నిర్వహిస్తుండగా, బీఆర్ఎస్ నాయకులు వచ్చి సామగ్రిని ఎలా తీసుకెళ్తారన్నారు. మాయం అయిన సామగ్రిపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయ పుస్తకాలు వినియోగించాలి

కెరమెరి: రూం టు రీడ్‌లో భాగంగా పాఠశాలలకు అందించిన గ్రంథాలయ పుస్తకాలను వినియోగించాలని లిటరసీ ఫెసిలెటర్ రాజు అన్నారు. చౌపన్‌గూడ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటి వల్ల మేధోమదనం జరగడంతో పాటు నూతన కథలు తెలుసుకునే అవకాశం ఉందని చెప్పారు.

కెరమెరి: విద్యార్థులకు చదవడం, రాయడం రావాలని కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని ఉర్దూమీడియం పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. విద్యార్థులను చదివించి, రాయించారు. 3 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులందరికీ చదువు రావాలన్నారు.

పాఠశాలను సందర్శించిన ఉన్నతాధికారులు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు రవికాంత్ ఆధ్వర్యంలో సందర్శించారు. పాఠశాలలో ఉన్నతి కార్యక్రమాల అమలు తీరును, 10వ తరగతి విద్యార్థుల లక్ష్య కార్యక్రమాలను పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందంతో సమావేశమై బోధనా అభ్యాస కార్యక్రమాలపై పలు సూచనలు చేసి ఉన్నత కార్యక్రమాల అమలుపై మరిన్ని సూచనలు చేసి అభినందించారు. సెక్టోరియల్ అధికారి చౌదరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీని గెలిపించాలి

■ బొగ్గుబాయి వార్తలు



మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించాలని ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు తెలిపారు. ఎస్ఆర్పీ 3, 3ఏ గనిపై గురువారం ఆయన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోల్‌బెల్ట్ పరిధిలోని 11 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు కార్మికవర్గం అఖండ మెజారిటీ ఇచ్చి ఎమ్మెల్యేలను గెలిపించారన్నారు. ఇదే స్ఫూర్తితో 11 సింగరేణి ఏరియాలో ఐఎన్టీయూసీని కార్మికులను ఆదరించి గెలిపించాలన్నారు. సింగరేణిలో కార్మికులకు హక్కులు కల్పించిన చరిత్ర తమకే ఉందన్నారు. ఎన్నికల్లో తాము ఎవరితో పొత్తు ఉండడం లేదని తెలిపారు. దీనిపై తమ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, వేజ్‌బోర్డు సభ్యులు జనక్‌ప్రసాద్ ఇదివరకే స్పష్టం చేసినట్లు తెలిపారు. ఏఐటీయూసీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కార్మికులు నమ్మొద్దన్నారు. ఈ సందర్భంగా సుమారు 20మంది కార్మికులు ఐఎన్టీయూసీలో చేరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యామ్, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ గరిగే స్వామి, తిరుపతిరెడ్డి, నాయకులు భీమ్ రవి, మోతే రాఘవరెడ్డి, నర్సింగ్, శీలం చిన్నయ్య, సమ్మిరెడ్డి, వీరమల్లు, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కోడ్ ముగిసింది.. ఇక పనులే ఆలస్యం

- రోడ్డు, డ్రెయినేజీ పనులు సాగక కాలనీవాసుల ఇబ్బందులు
- దుమ్ము, ధూళితో శ్వాస ఇబ్బందులు
- చలికాలం కావడంతో అస్తమా రోగులకు అవస్థలు



మహాలివాడలో 60ఫీట్ల రోడ్డు కోసం చదును చేసి, తారు వేయకుండా వదిలేసిన వైనం

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో చేపడుతున్న పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్త పనులను ప్రారంభించకపోయినా, గతంలోనే ప్రారంభించిన పనులను సైతం పూర్తిచేయడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దాదాపుగా నెలన్నర రోజుల పాటు, ఎన్నికల విధుల్లోనే మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉండడంతో, పనులను పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్లు ఎక్కడికక్కడ నిలిపివేశారు. మంచిర్యాల మున్సిపాలిటీలో రోడ్ల వెడల్పు, డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం కోసం రూ.13కోట్ల నిధులతో చేపడుతున్న 350రకాల పనుల్లో కొన్ని నిలిచిపోగా, మరికొన్ని ప్రారంభానికే నోచుకోవడం లేదు. ప్రారంభించిన మరికొన్ని నత్తనడకన కొనసాగుతున్నాయి. పనులను ప్రారంభించి, వాటిని పూర్తి చేయకపోవడంతో రోడ్లన్నీ దుమ్ము, ధూళితో పేరుకుపోయి, వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము లేస్తూ ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. చలికాలం కావడంతో చలితో పాటు, దుమ్ముతో చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎన్నికలు ముగియడంతో పెండింగ్ పనులపై మున్సిపల్ అధికారులు దృష్టిసారిస్తే, చలికాలంలో ప్రజలకు దుమ్ము, ధూళి నుంచి కొంత వరకైనా రక్షణ లభిస్తుంది.

నెలలు గడుస్తున్నా... పూర్తికాని పనులు

అసెంబ్లీ ఎన్నికల కోడ్ పేరుతో కొత్త పనులు ప్రారంభం కాకపోగా, అప్పటికే ప్రారంభించిన పనులను మాత్రం పూర్తి చేయడంలో తాత్సారం చేస్తున్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, కమ్యూనిటీ హాల్స్, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ దీపాల ఏర్పాటుకు కాంట్రాక్టర్లు పనులను చేయడంలో ఆలస్యం చేస్తుండగా, దానికి తోడు ఎన్నికల ప్రభావం పడింది. గంగారెడ్డి రోడ్డు, వాటర్ ట్యాంక్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం వెనుక, ముందు పాత రోడ్లపై బీటీ నిర్మాణం కోసం రూ.4.20కోట్లను కేటాయించినా, ఎన్నికల కోడ్‌తో ఆయా పనులు నిలిచిపోయాయి. హైటెక్‌సిటీ కాలనీలో రూ.3కోట్లతో వేయాల్సిన రోడ్డు పనులు సైతం నిలిచిపోగా, ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి. దీంతో పాటు హమాలివాడ భాగ్యలక్ష్మి చికెన్ సెంటర్ నుంచి తిలక్‌నగర్ క్రాస్ రోడ్డు వరకు చేపట్టిన 60ఫీట్ల రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌తో కూడిన పనులకు గాను టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.5.85 కోట్లు కేటాయించి, ఈ ఏడాది జనవరి 27న రోడ్డు వెడల్పు పనులను ప్రారంభించినా, రోడ్డు వెడల్పు పనులు నిలిచిపోగా, అందుకు తగినట్లుగా నిర్మించాల్సిన డ్రెయినేజీ పనులు, తాగునీటి పైప్‌లు వేసే పనులను తరుచూ కాలనీవాసులు అడ్డుకుంటున్నారు. దీంతో గత 9 నెలల క్రితం రోడ్డు విస్తరణ ప్రారంభించినా, ఇప్పటికీ పనులు ముందుకు సాగకపోవడంతో, అభివృద్ధి కుంటుపడుతోంది. రోడ్డు పనులను ప్రారంభించి వదిలేయడం వల్ల రోడ్డుపై దుమ్ము, ధూళి చేరి వాహనాల రాకపోకలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

దుమ్ములేచి.. శ్వాస ఇబ్బందులు

రోడ్డు వెడల్పు పనులను ప్రారంభించి 10నెలలు దాటినా ఇప్పటికీ ఆయా పనులను పూర్తి చేయలేదు. హమాలివాడ నుంచి తిలక్‌నగర్ వరకు 60ఫీట్ల రోడ్డు వెడల్పు పనులను చేయడంలో వస్తున్న ఇబ్బందులను పరిష్కరించకుండానే, రోడ్డును తవ్వి వదిలేయడం వల్ల వాహనాల రాకపోకలతో దుమ్ము లేస్తోంది. వాహనదారులతో పాటు, స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

- బొమ్మకంటి కృష్ణ, మంచిర్యాల

పనులు పూర్తి చేయాలి

మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు పనులను చేసేందుకు వాటిని ప్రారంభించినా, పూర్తి చేయడంలో చేస్తున్న ఆలస్యం వల్ల రోడ్లపై దుమ్ము, దూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రారంభించిన పనులను త్వరగా పూర్తి చేస్తే, ప్రజలకు ఇబ్బందులు ఉండవు. హమాలివాడ నుంచి తిలక్‌నగర్ వెళ్లే రోడ్డు పనులు దాదాపుగా ఏడాది నుంచి నత్తనడకన నడుస్తున్నాయి. త్వరగా రోడ్డు పనులను పూర్తి చేయాలి.

- దీటి రవి, మంచిర్యాల

సంకల్పం ఉంటే సాధించవచ్చు

- ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న రఘుకుమార్

శ్రీరాంపూర్: సంకల్ప బలం గట్టిగా ఉంటే దేనినైనా సాధించవచ్చని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్ తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో గురువారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన విద్యార్థిని, విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయానికి వైకల్యం ఎప్పుడు అడ్డురాదన్నారు. ఒక లక్ష్యాన్ని పెట్టుకొని దాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ జనరల్ మేనేజర్లు అరవిందరావు, ఆనందకుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, స్పోర్ట్స్ కార్యదర్శి పాలకుర్తి రాజు, సూపర్‌వైజర్ చాట్ల అశోక్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల నగర సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియంలో ఈ నెల 8న జిల్లా స్థాయి అయ్యప్ప స్వాముల మహా సంగమం, మండల పడి పూజను పురస్కరించుకొని అయ్యప్ప స్వాములు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు గురువారం శ్రీరాంపూర్ కాలనీలోని భక్తాంజనేయ స్వామి దేవాలయం నుంచి అయ్యప్ప, గణపతి, కుమార స్వాముల చిత్రపటాలతో కాలనీ పురవీధుల్లో అయ్యప్ప స్వామి నామస్మరణతో సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ శ్రీరాంపూర్ శాఖ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రాజేశం, ఉపాధ్యక్షులు చందర్, స్వాములు శివకుమార్, రవికృష్ణ, సురేందర్, ఐలయ్య, హరీష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

10న సమ్మేళనం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఈనెల 10న సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సునీల్‌మసాదే, సిర్ప అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 1963 నుంచి 1971 వరకు టెన్త్ చదువుకున్న పూర్వవిద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు.